క్లుప్తంగా

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

బంట్వారం: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్‌దే అధికారమని ఆ పార్టీ మైనార్టీ యూత్ నాయకుడు ఖదీర్ పాష శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అన్వర్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం యావత్ దేశ ప్రజానీకానికి తెలుసన్నారు. అర్థ రహిత ఆరోపణలు చేయడం మానుకోవాలంటూ హితవు పలికారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముస్లింల 4 శాతం రిజర్వేషన్లు తీసేస్తామన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ మాత్రం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపారని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

పరిగి: గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద ప్రజలు ఉంటారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. శనివారం చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జనసమితి వైస్ చైర్‌పర్సన్, డాక్టర్ శివరాజ్, తహసీల్దార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కొనసాగుతున్న రోడ్డు పనులు



నూతనంగా నిర్మించిన కరన్‌కోట్ రోడ్డు

తాండూరు రూరల్: తాండూరు మండలం కరన్‌కోట్ రోడ్డుకు మహర్దశ సంతరించుకుంది. గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి కరన్‌కోట్ వరకు రోడ్డు మరమ్మతుల కోసం ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి కృషితో రూ.9.50కోట్ల నిధులు మంజూరు చేయించారు. వర్షాకాలం వచ్చేలోపు రహదారి పనులు పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను అధికారులు ఆదేశించడంతో మరమ్మతు పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా.. కొత్తగా వేస్తున్న కరన్‌కోట్ రోడ్డుపై ఓవర్‌లోడ్ వాహనాలు వెళ్తున్నాయి. ఇలా అధిక లోడ్ కారణంగా రోడ్డు త్వరగా ధ్వంసమవుతుందని, వాటిని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

'మనబడి' పనులు త్వరగా పూర్తిచేయండి

తాండూరు రూరల్: మనఊరు–మనబడి పనులు ఈ నెల ఆఖరులోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని మల్కాపూర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ రవిసింథే, ఉప సర్పంచ్ అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లయినా ముహూర్తం లేదా?



నిరుపయోగంగా ఉన్న రైతు వేదిక

కొడంగల్: హస్నాబాద్‌లో మూడేళ్ల క్రితం నిర్మించిన రైతు వేదికను ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని రేవంత్ నివాసంలో వారు మాట్లాడారు. వేదిక నిర్మించి మూడేళ్లవుతున్నా.. ప్రారంభించేందుకు ముహూర్తం దొరకడం లేదా అని ప్రశ్నించారు. వేదిక వినియోగంలో లేనందున అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని వాపోయారు. పాలకులు వెంటనే స్పందించి వేదికను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. లేని ఎడలా పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భీములు, అంజిలప్ప, వెంకటయ్య, మదన్, మహిపాల్‌రెడ్డి, వెంకటేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి

దోమ: పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో మురుగు కాలువలు, చెత్త, చెదారాన్ని గ్రామ పంచాయతీ సిబ్బందితో తొలగించామని చెప్పారు. నిత్యం వీధులను పరిశుభ్రం చేయిస్తున్నామన్నారు. ఇంట్లో నుంచి ఇచ్చే తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

అరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని.. అమ్ముకుందామంటే అన్నదాతకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. అష్టకష్టాలు పడి పొలాల నుంచి కొనుగోలు కేంద్రాలకు దిగుబడి తీసుకువస్తే.. కొనుగోళ్ల ప్రక్రియ ముందుకు సాగక.. కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి.

- లారీల కొరతతో తరలింపులో జాప్యం
- సరిపడా మిల్లులు లేక అవస్థలు
- కొనుగోలు కేంద్రాల వద్దే కర్షకుల పడిగాపులు
- వెంటాడుతున్న వర్షం భయం



బొంపల్లి వద్ద కొనుగోళ్లు నిలిచిపోవడంతో ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలు

దోమ: పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నదాతలు అనేక అగచాట్లు పడుతున్నారు. ఓ పక్క వర్షం భయం, మరో పక్క లారీలు, గన్నీ బ్యాగుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిగి డివిజన్‌లో ఒకే మిల్లును అధికారులు ఏర్పాటు చేయడం, సరిపడా లారీలు లేక.. రైతులు తీసుకువచ్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మగ్గుతోంది. కేంద్రం వద్ద సరైన వసతులు లేకపోవడంతో వర్షం పడి ఎక్కడ ధాన్యం తడుస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

150 మెట్రిక్ టన్నుల కొనుగోలు

మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉండగా.. అధికారులు 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో తొమ్మిది, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నాలుగు, ఐకేపీ ఆధ్వర్యంలో రెండు సెంటర్లను ఏర్పాటు చేశారు. అయితే మండలంలో 25,146 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 150 మెట్రిక్ టన్నులు సేకరించామని అధికారులు తెలిపారు. ఇంకా 24 వేల మెట్రిక్ టన్నులకు పైగా రైతుల నుంచి ధాన్యం రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

కేంద్రాల వద్దే పడిగాపులు!

లారీల కొరత కారణంగా కొనుగోలు సెంటర్ల వద్ద ధాన్యం నిల్వ పేరుకుపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వెంటాడుతున్న వర్ష సూచనతో భయాందోళనకు గురవుతున్నారు. ఒక్కటే రైస్ మిల్లు ఏర్పాటు చేయండం, ఆయా సెంటర్ల నుంచి లారీల ద్వారా తీసుకువచ్చే ధాన్యం మిల్లు దగ్గర దిగుమతి చేయలేని పరిస్థితులు తలెత్తాయి. లారీలు పూర్తిగా మిల్లు వద్దే స్తంభించడంతో కొనుగోలు సెంటర్లకు వాహనాలు రాక ధాన్యం నిల్వ పెరుగుతోంది. దీంతో బొంపల్లి, దాదాపూర్, మోత్కూర్, ఖమ్మం నాచారం, కిష్టాపూర్ గ్రామాలతో పాటు ఆయా సెంటర్లకు రైతులు తీసుకువచ్చే ధాన్యం దించుకోవడానికి స్థలం లేక.. ట్రాక్టర్లలోనే నిల్వ ఉంచుకొని రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. అంతే కాకుండా టార్పాలిన్లు, నీటి వసతి, గన్నీ బ్యాగులు, ధాన్యం ఆరబోతకు స్థలం లేక ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా గోనె సంచుల కోసం రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా.. స్టాకు రాలేదని నిర్వాహకులు చెబుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, లారీల కొరత తీర్చి, గన్నీబ్యాగులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేయాలని రైతులు కోరుతున్నారు.

లారీల కొరత తీర్చాలి



కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోవడంతో సెంటర్ల వద్ద ధాన్యం పేరుకుపోయింది. రెండు రోజుల క్రితం ట్రాక్టర్‌పై 200 ధాన్యం బస్తాలు సెంటర్ వద్దకు తీసుకువచ్చాను. లారీలు రాలేదని నిర్వాహకులు చెప్పడంతో.. ట్రాక్టర్‌తో ఇక్కడే ఉన్నాను. వర్షం పడితే ధాన్యం తడిసిపోతుంది. లారీల కొరత తీర్చి, కొనుగోళ్లు ప్రారంభించాలి.

– రమేశ్, రైతు, తిమ్మాయిపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



లారీల కొరత విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో అన్ని సెంటర్లకు లారీలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రతి కేంద్రం వద్ద రైతులకు వసతులు ఏర్పాటు చేయిస్తాం. గన్నీ బ్యాగుల కొరత లేకుండా దృష్టి సారిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ప్రభాకర్ రావు, ఏఓ, దోమ

ఆసుపత్రుల అభివృద్ధికి రూ.42.50 లక్షలు

జీఓ జారీచేసిన వైద్య ఆరోగ్యశాఖ

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో వైద్య పరికరాల కొనుగోలు నిమిత్తం రూ.42.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం వైద్య ఆరోగ్య శాఖ జీఓ నంబర్ 233ను జారీ చేసింది. రెండు ఆసుపత్రుల్లో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు ఆధునిక వైద్య పరికరాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. ఇదిలా ఉండగా.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కావాల్సిన పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు చేయాలని గతంలో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి కోరడంతో ప్రభుత్వం ఈ నిధులు కేటాయించింది. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. జిల్లా ఆసుపత్రిలో నూతనంగా 60, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 20 పడకలు, ఆరు కంప్యూటర్లు, ప్రింటర్లు, ఎక్స్‌రే మిషన్, ఈసీజీ మిషన్ తదితర పరికరాలను కొనుగోలు చేయనున్నారు.



మాతా శిశు ఆరోగ్య కేంద్రం

స్వచ్ఛతలో భాగస్వాములు కండి

- వ్యర్థ పదార్థాలను రీసైక్లింగ్‌కు ఇవ్వండి
- మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప

తాండూరు టౌన్: 'మన పరిసరాలను మనమే కాపాడుకోవాలి. ఇందుకోసం స్వచ్ఛ తాండూరులో ప్రజలంతా భాగస్వాములు కావాలి' అని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప అన్నారు. శనివారం కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్–2023లో భాగంగా పట్టణంలో 'మేరీలైఫ్–మేరీస్వచ్ఛ షహర్' అనే పేరుతో ఈనెల 20 నుంచి పర్యావరణ దినోత్సవం జూన్ 5వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అందులో భాగంగా శనివారం 9వ వార్డు సాయిపూర్‌లో స్వచ్ఛ సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దీప మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. రెడ్యూస్, రీ యూజ్, రీసైకిల్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. ఇంట్లో వాడిన పాత సామగ్రి, బట్టలు, పుస్తకాలు, సీసాల వంటి వాటిని బయట పారవేయకుండా మున్సిపాలిటీ వారికి అందజేస్తే వాటిని రీ సైక్లింగ్ చేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తారని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్, డీఈఈ రంగనాథ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్, ప్రవీణ్, మెప్మా ప్రతినిధి సరిత, ఆర్పీలు హారిక, సైరాభాను, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



సామగ్రి సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది. చిత్రంలో వైస్ చైర్‌పర్సన్ దీప తదితరులు

సంపద పెంచి పేదలకు పంచుతున్నాం

- ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలి
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో సంపద పెంచి పేదలకు పంచుతున్నారని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు అవుతున్న సందర్భంగా రాష్ట్రంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడానికి ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. జూన్ రెండు నుంచి 21 రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. రైతులకు ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు తదితర పథకాలను పేదలందరికీ అందించినట్లు చెప్పారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిలో వైకుంఠధామాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, సీసీ, బీటీరోడ్లు నిర్మించినట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్లు మధుసూదన్‌రావ్ యాదవ్, బీఎమ్ రమేష్, సర్పంచులు వెంకట్‌రెడ్డి, గోవింద్, అంజద్, నాయకులు రమేష్‌బాబు, దాసప్ప యాదవ్, గోడల రాంరెడ్డి, దత్తురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం..

గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సీఎం కప్–2023 టోర్నీ విజేతలకు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు, క్రీడాకారులకు ఆటల పోటీలు నిర్వహించి వారిలోని ప్రతిభను గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, ఎంపీడీఓ పాండు, డిప్యూటి తహసీల్దార్ సురేష్, ఎమ్ఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

జూన్ 2నుంచి ఆన్‌లైన్ క్విజ్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్ రెడ్డి

- డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్ రెడ్డి

పరిగి: యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 'రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్' పోటీలు నిర్వహించనున్నారని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి అవకాశాలు లేక యువత తీవ్ర నిరాశతో ఉందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రేవంత్‌రెడ్డి.. జూన్ 2 నుంచి రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. ఈ పోటీలకు 16 నుంచి 35 సంవత్సరాలు కలిగిన యువతీయువకులు అర్హులని చెప్పారు. జూన్ 1వ తేదీ లోపు 7661899899 నంబర్‌కు మిస్డ్ కాల్ చేసి, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ క్విజ్‌లో గెలుపొందిన వారికి ఓ స్కూటీ, సెల్‌ఫోన్, ఐపాడ్‌లాంటి బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పట్టణ మండల అధ్యక్షుడు కృష్ణ, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, న్యాయవాదులు ఆనంద్‌గౌడ్, నర్సింహులు, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, నర్సింహరావు, ఆంజనేయులు ముదిరాజ్, సురేందర్ ముదిరాజ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: ఆదివారం నుంచి ఈ నెల 27 వరకు నిర్వహించనున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. 5 జోన్‌ల నుంచి ఒక్కో జోన్ పరిధిలో.. ఒక వార్డును ఎంపిక చేసి, ఒక్కరోజు 5 వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా ప్రతి వార్డుకు 30మంది పారిశుధ్య కార్మికులు, జేసీబీ, ట్రాక్టర్ కేటాయించడం జరుగుతుందన్నారు. పనుల ప్రారంభానికి ముందు, పూర్తయిన తర్వాత ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ డీఈ, మేనేజర్ కృపాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మొయినొద్దీన్, మున్సిపల్ సిబ్బంది, స్పెషల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసాపత్రాలు

దౌల్తాబాద్: సీఎం కప్ టోర్నీలో గెలుపొందిన క్రీడాకారులకు శనివారం ఎంపీపీ విజయ్‌కుమార్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతి ఆటగాడు పోటీల్లో తలపడాలని సూచించారు. మండల స్థాయిలో గెలుపొందిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమలస్వామి, తహసీల్దారు కృష్ణయ్య, ఎంపీఓ రవీందర్, ఎంఈఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు, ఎంపీపీ

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

కుల్కచర్ల: బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని చైల్డ్‌లైన్ మండల కోఆర్డినేటర్ రాంచంద్రయ్య అన్నారు. శనివారం అంతారం గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల వలన కలిగే నష్టం, మూఢనమ్మకాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలబాలికల హక్కులను కాపాడటానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాటక ప్రదర్శన



కళాకారులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

యాలాల: హాజీపూర్‌లో వారం రోజులుగా ప్రదర్శిస్తున్న మల్లికార్జున స్వామి వీధి నాటకం శుక్రవారం అర్ధరాత్రి ముగిసింది. ఈ సందర్భంగా కళాకారులకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా ఆర్థిక సహాయం అందజేశారు.

అన్నపూర్ణదేవికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న మహిళలు

ధారూరు: వీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన అన్నపూర్ణదేవి 12వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు చెన్నబసవయ్య స్వామి, కుమారస్వామీల ఆధ్వర్యంలో ఈ పూజలు కొనసాగాయి. అమ్మవారికి ముందుగా పాలాభిషేకం, తైలాభిషేకం, జలాభిషేకం చేశారు. కుంకుమార్చన అనంతరం భక్తులకు హారతి ఇచ్చి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తర్వాత ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజ చేశారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి



అవగాహన కార్యక్రమంలో కిషోరబాలికలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు

పూడూరు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్సమ్మ అన్నారు. శనివారం మంచన్‌పల్లి గ్రామంలో కిషోరబాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలపై లైంగిక దాడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ కమిటీపై ఉందన్నారు. ఆపదలో ఉన్న వారు చైల్డ్‌లైన్ హెల్ప్ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజయ్య, ఎంపీటీసీ లక్ష్మణ్, వార్డు సభ్యులు వీరేష్, రామాంజనేయులు, శ్రీశైలం, పాఠశాల హెచ్‌ఎం సుభాష్, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, అనసూయ, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశవర్కర్లు చంద్రకళ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం!



చంద్రాయన్‌పల్లి ప్రాథమిక పాఠశాల (ఇన్‌సెట్లో) పాఠశాలలో ఫర్నిచర్



- విద్యాభివృద్ధికి శ్రమించిన ప్రభుత్వం
- ఫలితాలను నీరుగార్చిన ఉపాధ్యాయులు
- టీచర్ల పనితీరుపై సర్వత్రా విమర్శలు

మోమిన్‌పేట: కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మనఊరు–మనబడి కార్యక్రమం కింద ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు వెచ్చించింది. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తే ఫలితాలు మెండుగా ఉంటాయని భావించింది. మౌలిక వసతుల కల్పనకు సంబంధిత అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించింది. పది విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట హంగామా చేసింది. కానీ.. ఫలితాలు మాత్రం నిరాశపరచాయి. దీంతో ప్రభుత్వ ఉపాధ్యాయులపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ చూపలేదని, వారి వ్యక్తిగత అవసరాలకే సమయం కేటాయించి పిల్లల జీవితాలతో ఉపాధ్యాయులు చెలగాటమాడారన్న ఆరోపణలు వచ్చాయి. సర్కారు శ్రమ వృథా అయిందని మండిపడ్డారు. ప్రజా సంఘాల నుంచి కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి.

మండలంలో 19పాఠశాలలు..

మండల పరిధిలోని 6ఉన్నత పాఠశాలలతో కలిపి మొత్తం 19 బడులను మనఊరు–మనబడి కింద అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో భాగంగానే నిధులు మంజూరు చేసింది. టేకులపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు సుమారు రూ.90లక్షలకు పైగా మంజూరయ్యాయి. కానీ అక్కడి పాఠశాలలో పది ఫలితాలు గతితప్పాయి. 19మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. ఆరుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. చీమల్‌దరి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి రూ.60లక్షలకు పైగా ఖర్చుచేశారు. అక్కడ 6మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. ఇద్దరు మాత్రమే పాసయ్యారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో శ్రమిస్తుండగా.. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా మొన్నటి పదో తరగతి ఫలితాలు తల్లకిందులయ్యాయని, ఇందుకు వారిదే బాధ్యత అని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఉపాధ్యాయుల పాత్ర లేకుండా ఫలితాలు రావడం కష్టమేనని, ఉన్నతాధికారులు టెన్త్ రిజల్ట్‌పై సమీక్ష జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.